ఇండిగో సేవల నిలిపివేత

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బెళగావి-బెంగళూరుల మధ్య కొనసాగుతున్న ఇండిగో విమాన సర్వీసులకు ఈనెల 27నుంచి నిలిపివేయనున్నారు. రెండు కీలక నగరాల మధ్య ప్రతిరోజూ విమాన సర్వీసులు ఉండేవి. ఉదయం బెళగావి నుంచి బయల్దేరే విమానం ద్వారా బెంగళూరుకు చేరుకునేవారు. ఇక్కడనుంచి అంతర్జాతీయ ప్రయాణాలకు అనుకూలం ఉండేది. మరోవైపు బెళగావి నుంచి బెంగళూరుకు వచ్చి సాయంత్రానికి బెళగావికి వెళ్లేవారు. 85 శాతం ఆక్యుపెన్సీ ఉన్నా విమాన సర్వీసులను రద్దు చేయాలని తీర్మానించడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది.

- 700 కిలోల బంగారు అంబారిపై కొలువైన అమ్మవారు
- జనసంద్రంగా మారిన మైసూరు
- ముగిసిన దసరా ఉత్సవాలు


అమ్మవారికి నమస్కరిస్తున్న సీఎం


అగ్నితో విన్యాసాలు


జంబూసవారిపై అమ్మవారు


ఖడ్గాన్ని చేతపట్టిన యువరాజు యదువీర్



అంగరంగ వైభవంగా జంబూసవారి



బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక మైసూరు దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. నవరాత్రి వేడుకల్లో కీలకఘట్టమైన జంబుసవారిని లక్షలాదిమంది వీక్షించారు. శనివారం ఉదయం నుంచే మైసూరుకు కొత్త శోభ వచ్చింది. ఎటుచూసినా జనసంద్రంగా మారింది. చాముండేశ్వరి ఆలయంలో తెల్లవారునుంచే ప్రత్యేక పూజలు కొనసాగాయి. మధ్యాహ్నం నుంచి ప్యాలెస్ ప్రాంగణంలో జంబూసవారి వేడుకలు ఆరంభమయ్యాయి. నందిధ్వజం వద్ద సీఎం సిద్ధరామయ్య వేడుకలకు శ్రీకారం చుట్టారు. అయితే నగరవ్యాప్తంగా వర్షం కురవడంతో లక్షలాదిమంది భక్తులు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం 4-4.30 గంటలలోపు జంబుసవారికి పుష్పార్చన చేయాల్సి ఉన్నా వర్షం కారణంగా అరగంట ఆలస్యమైంది. చల్లని వాతావరణంలో వేలాదిమంది భ క్తులు చాముండేశ్వరి దే వికి జై, ఊఘే చాముండి అంటూ నినాదాలతో సందడి నెలకొంది.

అభిమన్యు గజరాజు 750 కేజీల బరువున్న బంగారు అంబారిపై కొలువైన చాముండేశ్వరి విగ్రహంతో గంభీరంగా ముందుకు కదలింది. అభిమన్యు వెంట గోపి, ప్రశాంత, సుగ్రీవ, ఏకలవ్య, భీమ, కంజన్‌తోపాటు పలు ఏనుగులు సవారిలో పాల్గొన్నాయి. ఊరేగింపులో 51 శకటాలు కదిలాయి. జిల్లాల వారీగా ప్రాధాన్యతతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలు, కేఎంఎఫ్ నందిని ఉత్పత్తులు వంటి శకటాలు ఆకట్టుకున్నాయి. దాదాపు వంద కళాబృందాలు పాల్గొన్నాయి. ఐదో సారి అభిమన్యు గజరాజు అంబారిని మోసింది. యాదగిరి తింథిణి మౌనేశ్వర ఆలయం, కొడగులోని భూసంరక్షణ హారంగి జలాశయం, కాఫీ, మిరియాల తోటలు, రాయచూరులోని ముద్గల్ కోట వంటి శకటాలు ఆకర్షణ అనిపించగా విధానసౌధతోపాటు పలు శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


జంబూసవారిపై ఊరేగుతున్న చాముండేశ్వరీదేవి

నగరమంతటా జనసంద్రం అనిపించింది. ప్రత్యేకించి ప్యాలెస్ మైదానంలోని మహారాజ మైదానం ప్రాంగణంలో జనం క్రిక్కిరిసిపోయారు. వేలసంఖ్యలో బస్సులు, వాహనాలు కదిలిరావడంతో మైసూరులో కొన్ని గంటలపాటు ఎటూ కదలలేని పరిస్థితి ఏర్పడింది. సాయం త్రం దివిటీల ప్రదర్శన కొనసాగింది.


శమీవృక్షానికి పూజలు చేస్తున్న యువరాజు యదువీర్

సంప్రదాయం ప్రకారం..

మైసూరు దసరా ఉత్సవాలలో భిన్నమైన సంప్రదాయం ఉంది. ఓవైపు ప్రభుత్వం సాంస్కృతిక కార్యక్రమాలు, యువదసరా, రైతు దసరా, మహిళా దసరా పేరిట ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగిస్తుంది. మరోవైపు చాముండిదేవికి ప్రతిరోజూ ఓ అలంకరణ ఉంటాయి. వీటన్నింటికంటే శతాబ్దాలకాలంగా వస్తున్న మైసూరు రాజసంప్రదాయాన్ని ప్యాలెస్‌లో యువరాజు కొనసాగిస్తారు. ప్రతిరోజూ బంగారు వజ్ర ఖచిత సింహాసనంపై ప్రైవేట్‌దర్బార్ నిర్వహిస్తారు. శుక్రవారం ఆయుధపూజలో రాజులకాలం నాటి కత్తులు, వివిధ యుద్ధ విన్యాసాలకు ఉపయోగించే వస్తువులకు పూజలు చేశారు. శనివారం విజయదశమిన చాముండేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు జరిపాక ఆయుధాలతో వెళ్లి జమ్మి చెట్టుకు పూజలు చేయడం ద్వారా ప్యాలెస్‌లో వేడుకలు ముగించినట్టు అవుతుంది. ప్యాలెస్ నుంచి చాముండేశ్వరి దేవి ఉత్సవ విగ్రహం అంబారికి తరలించే విషయంలో ఆలస్యమైందనే విమర్శలకు రాజమాత ప్రమోదాదేవి వివరణ ఇచ్చారు.

మైసూరు దసరా ఉత్సవాలు ప్రశాంతంగా విజయవంతంగా నిర్వహించడంపై సీఎం సిద్దరామయ్య అధికారులకు ప్రత్యేకంగా అభినందించారు. మరోవైపు దసరాకు శోభ తెచ్చేలా 135 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ మరో 12 రోజులపాటు కొనసాగించదలిచామని డీసీఎం డీకే శివకుమార్ ప్రకటించారు. ఉత్సవాల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హెచ్‌సీ మహదేవప్ప, శివరాజ్ తంగడగి తదితరులు పాల్గొన్నారు.



వైద్యవృత్తిలో నిరంతరం శ్రమించాలి

- పీఈఎస్ ఎంబీబీఎస్ కోర్సుల ప్రారంభంలో మంత్రి శరణప్రకాశ్ పాటిల్

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తిలో రాణించాలంటే నిరంతరం శ్రమించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శరణప్రకాశ్ పాటిల్ అన్నారు. ఎలక్ట్రానిక్‌సిటీలో పీఈఎస్ మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ తొలి ఏడాది కోర్సులను ఆదివారం ప్రారంభించారు. పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి అధ్యక్షత వహించగా ప్రొ-చాన్స్‌లర్ డి జవహర్, మెడికల్ డైరెక్టర్ సురేశ్ కృష్ణమూర్తి, జైపూర్‌కు చెందిన మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ డాక్టర్ అచల్ గులాటి, పీఈఎస్ వీసీ డాక్టర్ జే సూర్యప్రసాద్ పాల్గొన్నారు. పీఈఎస్ మెడికల్ కళాశాలకు ఈ ఏడాది అడ్మిషన్లకు అనుమతులు వచ్చిన మేరకు వందమంది విద్యార్థులు ఎంబీబీఎస్ కోర్సులో చేరారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ పీఈఎస్ మెడికల్ కళాశాలలో మౌలిక సదుపాయాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. 50ఏళ్లక్రితం గుణాత్మకమైన విద్య అందించాలనే లక్ష్యంతో పీఈఎస్‌ను దొరస్వామి ప్రారంభించారని అదే విధానం కొనసాగించడం సంతోషమన్నారు. గుణాత్మకమైన విద్యతోనే ఉజ్వల భారతావని సాధ్యమన్నారు. కర్ణాటకలో 71 మెడికల్ కళాశాలలు ఉన్నాయని వీటిలో 24 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉండడం సంతోషమన్నారు. ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండాలనేది ఆశయమన్నారు. గతంలో ఐదేళ్లు ఇదేశాఖమంత్రిగా వ్యవహరించానని మరోసారి అవకాశం లభించడం సంతోషమన్నారు. మెడికల్ కళాశాలల ఏర్పాటు ద్వారా రెండు విధాల ప్రయోజనాలన్నారు. రాష్ట్ర విద్యార్థులకు 40శాతం సీట్లు వస్తాయని తద్వారా ప్రతిభావంతులకు వైద్యవిద్య సులభతరం అవుతుందన్నారు. మెడికల్ కళాశాలల ద్వారా అన్ని విభాగాల ప్రొఫెసర్‌లు ఉంటారని తద్వారా ఆధునాతన వైద్యవిధానం స్థానికులకు అందుతుందన్నారు. మెడికల్ కళాశాలకు సంబంధించి పీఈఎస్ ఫైల్ రాగానే వెంటనే మరో ఆలోచన లేకుండా మంజూరు చేయించామన్నారు. ఈ ఏడాది మూడు ప్రైవేట్ కళాశాలలకు అనుమతులు దక్కడం సంతోషమన్నారు. పదేళ్లలో దేశమంతటా ఇంజనీరింగ్, మెడికల్ విద్యావిధానంలో చారిత్రాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల ప్రగతి ద్వారా ఐటీ నిపుణులు అత్యధికమంది ఉన్నందునే సిలికాన్‌సిటీ వంటి పేరు వచ్చిందన్నారు. వైద్యవృత్తిలో చేరినవారు కొన్ని విధానాలు పాటించాలన్నారు. డాక్టర్‌గా మంచి పేరు సాధించాలంటే కఠోరశ్రమ తప్పనిసరి అన్నారు. నైపుణ్యత పొందాలని రోగిని మానవత్వంతో వైద్యసేవలందించాలన్నారు. ఓ డాక్టర్‌గా అధ్యాపకుడిగా ఇది నా అనుభవమన్నారు. డాక్టర్‌గా ఆర్థికతకు లోటు ఉండదని అయితే సేవ చేసేవారికే సమాజం ఆదరిస్తుందన్నారు. చాన్స్‌లర్ ప్రొఫెసర్ దొరస్వామి మాట్లాడుతూ 22ఏళ్లక్రితం కుప్పంలో మెడికల్ కళాశాల ప్రారంభించామని ఆ అనుభవంతో బెంగళూరులోనూ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలనే నా లక్ష్యం తొలి అడుగు ఇప్పుడే ప్రారంభమైందన్నారు. నగరంలో ఎక్కడా అందని సేవాభావం, ఆధునాతన వైద్యం అందించాలన్నదే పీఈఎస్ కళాశాల లక్ష్యమన్నారు. ఎలక్ట్రానిక్‌సిటీకి అనుబంధంగా ఉండే వంద గ్రామాలను దత్తత తీసుకున్నామని అక్కడికి మా బృందాలు వెళ్లి తొలుత ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తారని ఆ తర్వాత వైద్య పరీక్షలు చేయించి అవసరమైన చికిత్సలు మెడికల్ కళాశాలలో అందిస్తామన్నారు. సమాజంలో భిన్నమైన జబ్బులు పెరుగుతున్నాయని డయాబెటిక్ ఓ వెంటాడే సమస్యగా మారిందన్నారు. వైద్యవిధానంలో మరిన్ని పరిశోధనలు జరగాలని చైనాలో డయాబెటిక్‌కు సంపూర్ణంగా నియంత్రించే విధానం వచ్చిందన్నారు. కేన్సర్ జబ్బులు పెరుగుతున్నాయని, జీవనశైలిలో ప్రజలు మార్పులు పాటించాలన్నారు. విశ్వంలో డాక్టర్‌లు, టీచర్‌లకు ఎనలేని ఆదరణ ఉంటుందన్నారు. నేను అత్యంత ఇష్టపడే గొప్పవారిలో అబ్దుల్‌కలాం ముఖ్యులని, ఆయన కుప్పం మెడికల్ కళాశాల ప్రారంభంలో గ్రామీణ, నగర ప్రాంతాలలో వైద్యసేవలలో వ్యత్యాసాన్ని తగ్గించాల్సి ఉందని అభిప్రాయపడ్డారన్నారు. అందుకే కుప్పంలో ఆధునాతన వైద్యసేవలు రెండు దశాబ్దాలకుపైగా నిరంతరంగా సామాన్యులకు అందిస్తున్నామన్నారు. అంతకుముందు వందమంది విద్యార్థులకు ప్రొఫెసర్ జవహర్ ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు.


ఎంబీబీఎస్ కోర్సుల ప్రారంభంలో మంత్రి పాటిల్, పీఈఎస్ చాన్స్‌లర్ దొరస్వామి

భార్య పేరిట అర్చన చేయించిన సీఎం

- సవదత్తి ఎల్లమ్మ ఆలయంలో పూజలు

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మైసూరు చాముండేశ్వరి ఉత్సవాల్లో పాల్గొన్న మరుసటి రోజే సీఎం సిద్ధరామయ్య మరో శక్తిదేవత సవదత్తి ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఆదివారం బెళగావి జిల్లా పర్యటనలో భాగంగా శక్తిపీఠం సవదత్తి ఎల్లమ్మను దర్శించుకుని భార్య పార్వతి పేరిట అర్చన చేయించారు. సాధారణంగా సీఎం సిద్దరామయ్య ఆలయానికి వెళ్లినా ప్రత్యేక పూజలు, ఇతరత్రా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వరు. అటువంటిది మైసూరు ఉత్సవాలలో చాముండేశ్వరి దేవి దయతోనే ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నానని, తల్లి ఆశీస్సులు నిరంతరం నాపై ఉంటాయన్నారు. తాజాగా భార్య పార్వతి పేరిట అర్చన చేయించారు. మంగళహారతి చేయించాక నాగమూర్తి దేవి వెండికిరీటంతో అర్చకులు ఆశీస్సులు అందించారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు సతీశ్‌జార్కిహొళి, లక్ష్మి హెబ్బాళ్కర్, హెచ్‌కే పాటిల్, రామలింగారెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు: సవదత్తి రేణుకా ఎల్లమ్మను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని సీఎం అన్నారు. రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి మండలి తొలిసభలో సీఎం మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి పలు పనులకు భూమిపూజ చేశారు. మహిళాభివృద్ధి మండలి ద్వారా నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. వచ్చే ఏడాది నాటికి 6వేలమంది భక్తులు సేద తీరేలాంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. శక్తి గ్యారెంటీతో ఇప్పటివరకు 300కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారన్నారు. రేణుకా ఎల్లమ్మను దర్శించుకునేందుకు వచ్చే మహిళా భక్తులు పెరిగారన్నారు. భక్తుల కోసం మరుగుదొడ్లు, పార్కింగ్, వసతి స్థలాన్ని కల్పిస్తామన్నారు. ఇక్కడికి వచ్చే భక్తులలో గ్రామీణ ప్రాంతానికి చెందినవారు అధికమని వారు బసచేసేందుకు వీలు కల్పిస్తామన్నారు. సవదత్తిలో 1087 ఎకరాల భూమి ఉందని మౌలిక సదుపాయాలకోసం ఉపయోగిస్తామన్నారు. సాయంత్రం ధారవాడలో రెడ్డి సహకారబ్యాంకు శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని కొత్త భవనాన్ని సీఎం ప్రారంభించారు. బ్యాంకు వ్యవస్థాపకులు ఎఫ్‌ట నలవడి, కేహెచ్ పాటిల్ విగ్రహాలను ఆవిష్కరించారు. పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టితోపాటు పలువురు పాల్గొన్నారు.


సవదత్తి ఆలయంలో ఆశీర్వాదం పొందుతున్న ముఖ్యమంత్రి


చన్నపట్టణకు నేనే అభ్యర్థిని..: డీకే

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'చన్నపట్టణ శాసన సభ ఉప ఎన్నికల్లో నేనే అభ్యర్థినని' ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి వ్యాఖ్యానించారు. ఆదివారం మైసూరులో మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, జేడీఎస్ పార్టీలు ఉమ్మడి అభ్యర్థిగా ఎవరినైనా పోటీ చేయించవచ్చునన్నారు. చన్నపట్టణలో వ్యక్తి పేరిట ఎన్నికల్లోకి వెళ్లేది లేదని, పార్టీ సిద్ధాంతాలకోసం ముందుకెళతామని, చన్నపట్టణ నుంచి తానే అభ్యర్థినన్నారు. ఎంపీ ఎన్నికల్లో కొంత వ్యత్యాసం జరిగిందని, ఎమ్మెల్యే ఎన్నికల్లోనూ పార్టీకి వెనుకంజ అయ్యిందన్నారు. ప్రస్తుతం మా బేస్ స్ట్రాంగ్ చేసుకున్నామని ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తారన్నారు. సీఎం సిద్దరామయ్య మరో పదేళ్లు సీఎంగా ఉంటారని, బీజేపీ వారు మరో దశాబ్దంపాటు ఇదే తరహాలోనే విమర్శలు చేస్తుంటారన్నారు. ప్రస్తుతం కనకపుర నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న డీకే శివకుమార్ ఉప ముఖ్యమంత్రిగా, బెంగళూరు నగరాభివృద్ధి, జలవనరులశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. అయినా పదే పదే చన్నపట్టణకు తానే అభ్యర్థిని అంటూ ప్రకటిస్తున్నారు. గతంలోనూ ఇటువంటి వ్యాఖ్యలే చేసి ఆ తర్వాత వెనుకడుగు వేశారు. ప్రస్తుతం మరోసారి అటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారు.



తుంగభద్రకు వరదపోటు

- ఏడాదిలో మూడోసారి జలాశయం గేట్ల ఎత్తివేత
- అన్నదాతల్లో హర్షాతిరేకాలు
- కర్ణాటకలో భారీ వర్షాలు
- డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో


తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్లు ఎత్తిన దృశ్యం



హంపిలో నీటమునిగిన పురందరదాస, ఇతర మండపాలు


కంప్లి కోట వద్ద వంతెనను తాకుతూ ప్రవహిస్తున్న నీరు

బళ్లారి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి)/బళ్లారి టౌన్/కంప్లి: తుంగభద్ర జలాశయం నిండ కుండలా తొనికిసలాడుతునంది. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు డ్యాం పైప్రాంతం నుంచి నీరు జలాశయంలోకి చేరుతున్నాయి. డ్యాం నీటి నిల్వ సామర్థ్యం మించి ఇన్‌ఫ్లో వస్తుండడంతో డ్యాం క్రస్ట్‌గేట్లు ఎత్తి నదికి నీరును విడుదల చేశారు. ఆదివారం ఉదయం బోర్డు అధికారుల నీటి లెక్కల ప్రకారం 101.656 టీఎంసీలు నీరు ఉన్నాయి. ఇన్‌ఫ్లో సరాసరి 84.505 క్యూసెక్కులు వస్తున్నాయి. 18 గేట్లు తెరిచి లక్ష క్యూసెక్కులు నదికి నీరు విడుదల చేస్తున్నారు. శనివారం మలెనాడు, అగుంబె తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఇన్‌ఫ్లో కొనసాగుతూనే ఉంది. ఆగస్టు 10 రాత్రి 18వ క్రస్ట్ గేటు నీటి ఉధృతికి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆగస్టు 16లోపు క్రస్ట్ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ అమర్చి డ్యాం నుంచి నీరు వృథాకాకుండా కాపాడారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ డ్యాంలో నీరు ఏమాత్రం తగ్గుముఖం పట్టలేదు. నిలకడగా 101 టీఎంసీలు నిల్వ ఉంటూనే వస్తున్నాయి.

కంప్లి కోట వద్ద వంతెనను తాకుతున్న నీరు

కంప్లి కోట వద్ద వంతెనను తాకుతూ నీరు ప్రవహిస్తున్నాయి. నదికి నీరు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో కంప్లి వంతెనపై రాకపోకలను ఎక్కడ బంద్ చేస్తారోనని ప్రయాణికులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మరోసారి నీరు ఉప్పొంగడంతో నది ఒడ్డున ఉన్న పంటలు నీటిలో మునిగి నష్టం వాటిల్లిందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ శివరాజ్ కంప్లి కోట వంతెనను పరిశీలించారు. కోటలో వుండే ప్రజలు అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీరు వంతెన కింద ప్రవహిస్తున్నాయి. ఒకవేళ నీరు ఎక్కువైతే కంప్లి-గంగావతి మధ్య వంతెనపై రాకపోకలను నిలిపివేస్తామని తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.97	1,614.75
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	84,504	360
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	82,968	9,254
సామర్థ్యం (టీఎంసీలు)	101.66	47.83

భవిష్యవాణి వినేందుకు తరలివచ్చిన భక్తులు



భవిష్యవాణి చెబుతున్న గొరవయ్య

కంప్లి, అక్టోబరు 13: కురుగోడు తాలుకా ఎర్రంగళి గ్రామంలో మైలార లింగేశ్వర దేవస్థానం వద్ద దసరా పండుగను పురస్కరించుకుని జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించిన అనంతరం గొరవయ్య తెలిపే భవిష్యవాణిని వినేందుకు భారీఎత్తున భక్తులు, ప్రజలు తరలివచ్చారు. ఏడు రోజుల పాటు భవిష్యవాణి చెప్పే నవీన్ బడిగేరు ఏడురోజులపాటు ఉపవాసం వుంటారు. పండుగ రోజు భవిష్యవాణి తెలిపిన అనంతరం ఆయన ఆహారం తీసుకుంటారని ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. భవిష్యవాణిలో రైతులు వర్ష ప్రభావంతో పూర్తిగా నష్టపోతారు. పండిన కాస్త పంటకు అధిక ధరలు పలికి కొందరు రైతులు లాభాల బాటలో వుంటారని తెలిపారు.

దేశానికి మల్లెపూవు మాలమల్లేశ్వరస్వామి కార్ణికం



కార్ణికం చెపుతున్న గొరవయ్య

బళ్లారి సిటీ, అక్టోబరు 13: శ్రీ క్షేత్రం దేవరగట్టులోని మాలమల్లేశ్వర స్వామి దేవస్థాన కార్ణికోత్సవాల్లో దేశానికి మల్లెపూవు అని గొరవయ్య కార్ణికం చెప్పారు. కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టులో మాల మల్లేశ్వరస్వామి దేవాలయం ఉంది. దసరా సందర్భంగా కార్ణికోత్సవాన్ని నిర్వహించారు. నవరాత్రుల్లో దైవజ్ఞుడైన గొరవయ్య 9 రోజులు ఉపవాసం ఉండి దసరా రోజు గుడి ఎక్కి లక్షలాది మంది భక్తుల సమక్షంలో కార్ణికం చెప్పారు. మాలమల్లేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు గిరిమాలయ స్వామి ఈఏడాది కార్ణికం చెప్పారు. 'దేశంలో మల్లె పూలు పూశాయి' నది ఒడ్డున గంగాదేవి నలిబడి ఉంది. నిలబడి వస్తుంది, రూ.6,700 పత్తి, రూ.3,400 మొక్కజొన్నలు, మూడు ఆరవతుంది.. ఆరు మూడవతుంది.. బహు పరాక్ అని కార్ణికం చెప్పారు. ఈమాటను దేవస్థానం విశ్లేషించి పత్తి, మొక్కజొన్న పంటలు సుభిక్షంగా ఉంటాయనీ, శాంతి నెలకొంటుందని చెప్పారు.

విజయ జ్యోతి యాత్రకు ఘన స్వాగతం

రాయచూరు, అక్టోబరు 13: వీరనారి కిత్తూరు రాణి చెన్నమ్మ పేరుతో నిర్వహిస్తున్న విజయ యాత్ర ఆదివారం రాయచూరు నగరానికి చేరింది. కొప్పళ జిల్లా నుంచి రాయచూరు జిల్లాకు ప్రవేశించిన ఈ యాత్రకు నగర పొలిమేరలో తహసీల్దార్ సురేష్ వర్మ ఘన స్వాగతం పలికారు. శోభాయాత్రను నగరంలోని ప్రధాన రహదారుల గుండా ఊరేగించిన అనంతరం దేవసుగూరు మీదుగా యాదగిరి జిల్లాలోకి ప్రవేశిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సురేష్ వర్మ, తహసీల్దార్ రాణి మాట్లాడుతూ కిత్తూరు చెన్నమ్మ శౌర్యం, సాహసం నేటి తరానికి ఆదర్శమన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడి వీరనారిగా ఖ్యాతి గడించిన రాణి కిత్తూరు చెన్నమ్మ నేటి తరం యువతకు, సమాజానికి మార్గదర్శకమన్నారు.



విజయ జ్యోతిని స్వాగతిస్తున్న తహసీల్దార్ సురేష్ వర్మ



హేమగుడ్డ వద్ద అంబారిపై ఊరేగుతున్న అమ్మవారు



కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో రథోత్సవం

వైభవంగా దుర్గాదేవి ఊరేగింపు

కంప్లి, అక్టోబరు 13: దసరా పండుగను పురస్కరించుకుని గంగావతి తాలుకా హేమగుడ్డ దుర్గాదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏనుగుపై భక్తులు ఊరేగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 37 జంటలకు సామూహిక వివాహాలు చేశారు. రాజశేఖర్ ఇత్నాల్, హెచ్‌ఆర్‌జీ శ్రీనాథ్, ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పరన్నమనువల్లి, తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ధూపదీప నైవేద్యాలు, పలు వేషధారణలతో ఊరేగింపు కొనసాగింది. అలాగే కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో కాళికాదేవి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కంప్లితో పాటు వివిధ గ్రామాల భక్తులు తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ పదాధికారులు పూజల్లో పాల్గొన్న వారికి అన్నదానం చేశారు.

ఘనంగా విజయదశమి

సిరుగుప్ప, అక్టోబరు 13: విజయదశమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా ప్రజలు విజయదశమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తాయమ్మ దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాద పంపిణీ చేశారు. పేట అంజనేయస్వామి, ఉచ్చీరప్ప తాత. బన్ని మహంకాళి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

రావణాసురుడి దహనం

బళ్లారి సిటీ: గనులనాడు బళ్లారిలో దశముఖ రావణ దహనం చేసి దసరా పండుగను ఘనంగా నిర్వహించారు. నగరంలోని దుర్గమ్మ ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ అనంతరం దుర్గమ్మ పల్లకి ఉత్సవం, దుష్టశక్తులపకప దశ ముఖ రావణ దహనానికి ఎమ్మెల్యే భరత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. వివిధ రకవాల బాణసంచా పేల్చి 15 అడుగల ఎత్తున్న రావణుడి దిష్టిబొమ్మను దహనం చేశారు.

శ్రీ వ్యాసరాజ మఠంలో: నగరంలోని రేడియో పార్కు శ్రీ వ్యాసరాజ మఠంలో విజయదశమి రోజున వేంకటేశ్వర పద్మావతి, శ్రీమద్వాచారుల చిత్రపటాలను పల్లకిలో ఉంచి మేళతాళాలతో భజన మండలి, కోలాట, సామూహిక దేవతా నామస్మరణంతో శమీవృక్షం వరకు ఊరేగించారు. అనంతరం మఠంలో భక్తులకు స్వస్తివచనం, మంగళహారతి, ప్రసాద వితరణ గావించారు. వ్యాసరాజ మహిళా భజనమంలి సభ్యులు, విశ్వ మద్వమాత వెల్ఫేర్ ఫౌండేషన్ అధికారులు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



కంప్లి: తాయమ్మదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు



రావణుడి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజలు



వ్యాసరాజ మఠంలో విజయదశమి వేడుకలు

వర్షానికి దెబ్బతిన్న పంటలు

కంప్లి, అక్టోబరు 13: తాలూకాలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చేతికొచ్చిన పంటలు నేలపాలయ్యాయి. హవినఅడగళి తాలుకాలో వరి పంటలు పూర్తిగా నేలకొరిగాయి. చేతికొచ్చిన పంటలు ఇలా నీటిపాలు కావడంతో రైతులు అందోళన చెందుతున్నారు. కొట్టూరు వద్ద కూడా శనివారం కురిసిన వర్షానికి కంది, పొద్దుతిరుగుడు పంటలు నీట మునిగాయి. ఈ యేడాది వర్షాలు అధికం కావడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



కొట్టూరు వద్ద నీటమునిగిన పొద్దుతిరుగుడు పంటను చూపుతున్న రైతు



గంగావతి సమీపంలో పొంగిప్రవహిస్తున్న తుంగభద్ర నది

విరుపాపుర గడ్డ, నవవృందావనం మార్గాలు బంద్

గంగావతి, రూరల్: తుంగభద్ర జలాశయం గేట్లు ఎత్తివేయడంతో నది పొంగి ప్రవహిస్తోంది. దీంతో గంగావతి తాలూకా విరుపాపుర గడ్డ, నవ బృందానికి వెళ్ళే రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి. నది ప్రవాహ కారణంగా ఆనెగొంది ప్రాంతంలో కొన్ని దేవాలయాలు, మంటపాలు నీటమునిగాయి. ఆనెగొంది వద్ద 64 సాలు మంటపాలు నీటిలో మునిగాయి. నదీతీర ప్రాంతాలకు ప్రజలు వెళ్ల వద్దని స్థానిక పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

రాజ్‌కుమార్ రోడ్డుకు నూతన శోభ

- 2న క్లాక్ టవర్ ప్రారంభం



ప్రారంభానికి ముస్తాబువుతున్న 100 అడుగుల క్లాక్‌టవర్



రాజ్‌కుమార్ రోడ్డు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 13: నగర నడిబొడ్డు రాయల్ సర్కిల్‌లో నిర్మిస్తున్న క్లాక్‌టవర్ ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్ కావడంతో యుద్ధప్రాతిపదికన 100 అడుగుల క్లాక్ టవర్ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. టవర్ క్లాక్‌పై నాలుగు సింహాలతో కూడిన అశోకుడి చిహ్నం ఏర్పాటు చేయగా... 'సువర్ణ బళ్ళారి' బంగారు వర్ణంతో రూపొందిస్తున్నారు. క్లాక్‌టవర్‌కు ఎదురుగా ఉన్న రాజ్‌కుమార్ రోడ్డు కూడా అదేరోజు ప్రారంభం కానున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమై ఆరు నెలల కావడంతో నగరంలో వాహనాల రాకపోకలు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. రోడ్డు నిర్మాణంలో భాగంగా ట్రాఫిక్‌ను తాత్కాలికంగా మళ్లించారు. అయినా నగరంలోకి చేరడానికి ఇదే ప్రధాన రోడ్డు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. రోడ్డుపై వేసిన కంకర రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో పైకి లేస్తున్న దుమ్ముతో కూడిన ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే మార్గంలో పాతమున్సిపల్ కళాశాల, సరళాదేవి డిగ్రీ కళాశాల, జిల్లా ఆసుపత్రికి వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం కావడంతో ప్రజలు దుమ్ముధూళిలోనే ప్రయాణించాల్సి వచ్చేది. ప్రారంభానికి ముహూర్తం దగ్గర పడడంతో మూడు రోజుల క్రితం రాజ్‌కుమార్ రోడ్డుపై తారురోడ్డు నిర్మాణం కావడంతో నగర ప్రజలు, వాహన దారులు ఊపరిపీల్చుకున్నారు.

ఏ క్షణంలోనైనా ఉప సమరానికి నోటిఫికేషన్

- ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం
- సండూరులో పార్టీల నాయకుల రాకపోకల సందడి

బళ్లారి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా సండూరు ఎమ్మెల్యే స్థానానికి ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణంలోనైనా వెలువడే అవకాశం ఉంది. ఇందుకు ఎన్నికల అధికారులు సిద్ధమవుతున్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా మంగళవారం సండూరులో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇంతకుమునుపు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఇ. తుకారాం ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి గెలిచారు. దీంతో తుకారాం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో సండూరు శాసనసభ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమైంది. సండూరులో బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ ఉండే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తుకారం సతీమణినే రంగంలో దించేందుకు అధిష్ఠానం దాదాపు సిద్ధమైంది. ఇక బీజేపీలో ప్రధానంగా మాజీ ఎంపీ దేవేంద్రప్ప, దివాకర్ అలాగే మరో 10 మంది పోటీలో ఉన్నారు. ప్రస్తుతం సండూరులో రాజకీయ సందడి నెలకొంది.

నేడు సీఎం సిద్దరామయ్య రాక

- ఏర్పాట్లు సిద్ధం : మంత్రి సంతోష్‌లాడ్



మాట్లాడుతున్న కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్

బళ్లారి సిటీ, అక్టోబరు 13: రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య సోమవారం సండూరుకు రానున్నారని కార్మిక శాఖ మంత్రి సంతోష్‌లాడ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నగరంలోని నూతన జిల్లాపాలనా భవనంలో సండూర్ పట్టణంలో నిర్వహించనున్న మహాసభల కార్యక్రమ సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి అయిన తరువాత సిద్దరామయ్య తొలిసారి బళ్లారి జిల్లాకు వస్తున్నారన్నారు. జిల్లాలోని సండూర్ పట్టణంలో పెద్దపెత్తున కార్యక్రమం చేపట్టి పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు. జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. సండూరు పట్టణంలోని ఏపీఎంసీ పాఠశాల ఆవరణలో సదస్సు ఉంటుందన్నారు. అధికారులు,మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తగు భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లాపోలీసు సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ప్రధానవేదిక నిర్మాణం, వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాల సమాచారం అందించే ధాన్యాగారం అంగళ్ళు, జిల్లాలోని వివిధ తాలూకాల నుంచి వచ్చే లబ్ధిదారులకు భోజన ఏర్పాట్లు మరుగుదొడ్ల, తాగునీరు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ లెదర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముండరగి నాగరాజు, హామీ పథకాల అమలు అథారిటీ వైస్ చైర్మన్ మెహరూజ్ ఖాన్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ముల్లంగి నందీశ్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప, ఎస్పీ శోభరాణి, ఏడీసీ మహ్మద్ జుబేర్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భువనేశ్వరీదేవి రథోత్సవం

రాయచూరు, అక్టోబరు 13: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరసభ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నాడదేవి భువనేశ్వరి రథాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ప్రతి ఏటా నాడహబ్బ పేరుతో విజయదశమి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న నగరసభ అందుకు తగినట్లుగా ఏర్పాట్లను చేసింది. మంగళవాయిద్యాలతో దేవి విగ్రహాన్ని నగర ప్రధాన రహదారుల గుండా స్థానిక బన్ని మండపం వరకు వైభవంగా ఊరేగించారు. ఊరేగింపులో కిల్లే బృహన్మఠం పీఠాధిపతి శాంతమల్ల శివాచార్య స్వామి, సిటీ ఎమ్మెల్యే డా.శివరాజ్‌పాటీల్, నగరసభ అధికారులు తదిలరులు పాల్గొన్నారు.



అమ్మవారిని ప్రత్యేక రథంలో ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా తపాలా దినోత్సవం



పోస్టల్ దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

సిరుగుప్ప, అక్టోబరు 13: పోస్టల్ శాఖ ఉత్తమ సేవలు అందిస్తోందని హెడ్ పోస్టుమాస్టర్ మంజునాథ శెట్టి అన్నారు. పట్టణంలో పోస్టల్ శాఖ కార్యాలయంలో 151వ పోస్టల్ దినోత్సవాన్ని నిర్వహించారు. హెడ్ పోస్టుమాస్టర్ మాట్లాడుతూ ప్రామాణికంగా సేవలు అందించడంలో పోస్టల్ శాఖ మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రతి ఇంటికి పోస్టల్ సేవలు అందించడంలో ముందడుగులో ఉన్నామని తెలిపారు. పోస్టల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోసూరు జోన్

ఆర్మీ అధికారులకు శుభాకాంక్షలు

హోసూరు అక్టోబరు 13: భారత్-శ్రీలంక స్నేహబంధాన్ని మెరుగుపర్చాలని కోరుతూ ఆర్మీ అధికారులకు హోసూరుల్లో 1500 కిలో మీటర్ల సైకిల్ యాత్ర చేపట్టిన మాజీ ఎమ్మెల్యే మనోక రన్, జాతీయ ఐఎన్‌టీయూసీ కార్యదర్శి ఘనస్వాగతం పలికారు, హైదరబాద్, కృష్ణగిరి జిల్లాకు చెందిన మేజర్ జనరల్ మోహన్, ఆర్మీ మెడికల్ కార్ప్స్ అధికారి సైకిల్ వాహన మాస్టర్ , కృష్ణగిరి జిల్లా డెంకణీకోట తాలూకా, సాలివారం గ్రామానికి చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ బ్రిగేడియర్ రవి మునిస్వామి మధ్య స్నేహాన్ని పెంపొందించేందుకు 1500 కిల్లోమీటర్లు సైకిల్ యాత్ర చేపట్టారు, ఇందుకోసం వీరిద్దరూ ఆదివారం ఉదయం బెంగళూరు నుంచి సైకిల్ పై బయలుదేరి హోసూరు చేరుకున్నారు. హోసూరు గాంధీ విగ్రహం ఎదుట ఆర్మీ అధికారి, మెకానికల్ ఇంజనీర్‌కు మాజీ ఎమ్మెల్యే మనోహరన్ ఆధ్వర్యంల్లో శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు.



ఆర్మీ అధికారులకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే మనోకరన్

జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజ్, కార్యదర్శి మునిరాజ్, కార్యదర్శి పరరమానంద ప్రసాద్, రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గ వీర మునిరాజ్, హోసూరు మున్సిపల్ చైర్మెన్ త్యాగరాజన్, ఐఎన్‌టీసి కార్యవర్గ సభ్యులు కోదండన్, మోహన్, సెల్వం, కుమార్, పలువురు పాల్గొని స్వాగతం పలికారు, ఈ విషయమై సైకిల్‌పై బయలుదేరిన మేజర్ జనరల్ మోహన్, బ్రిగేడియర్ రవి మునిస్వామి మాట్లాడుతూ.. హోసూరు నుంచి కృష్ణగిరి మీదుగా వెళ్తున్నామని తెలిపారు.



ఎంపీ సమక్షంలో పార్టీలో చేరిన స్థానిక యువత

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక

హోసూరు అక్టోబరు 13: హోసూరు నేతాజీ రోడ్డులో కృష్ణగిరి నియోజకర్గం ఎంపీ గోపినాథ్ కార్యాలయంలో ఆదివారం వివిధ పార్టీలను వీడినవారు కాంగ్రెస్‌లో చేరే కార్యక్రమం జరిగింది. మోహనతో పాటు వివిధ పార్టీలకు చెందిన 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆలిండియా యూత్ కాంగ్రెస్ కన్వీనర్ నెల్లికర్, రాష్ట్ర మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు సాదిఖాన్ ఎంపీ గోపినాథ్ సమక్షంల్లో కాంగ్రెస్‌ల్లో కొత్తగా చేరిన వారు ఎంపీ గోపినాథ్ పార్టీ జెండాను కప్పి నూతనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళుతూ పరలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం



హరీష్, రవి, మల్లికార్జున (ఫైల్)

బళ్లారిరూరల్, అక్టోబరు 13: దైవ దర్శనానికి వెళ్లి వస్తామని చెప్పిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. బళ్లారి తాలుకా హగరి సమీపంలో ఉన్న తక్కిన బూదేహాళ్ గ్రామానికి చెందిన రవి(26), హరీష్(23), మల్లికార్జున(26) ముగ్గురు యువకులు కర్నూలు జిల్లా ఆలూరు సమీపంలో జరుగుతున్న దేవరగట్టు బన్నీ ఉత్సవాలను తిలకించేందుకు శనివారం రాత్రి బయలుదేరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా అరికెర గ్రామం వద్ద బైకు అదుపుతప్పి బండరాయిని ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరు బళ్లారి విమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై కర్నూలు జిల్లా ఆలూరు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గ్రామంలో విషాదఛాయలు: దసరా పండుగ సందర్భంగా దేవరగట్టు బన్నీ ఉత్సవాలను తిలకించేందుకు వెళ్లిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తక్కిన బూదేహాళ్ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతి చెందిన ముగ్గురు యువకులు వారి తల్లిదండ్రులకు ఒకొక్కరే కావడంతో వారి కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా... 33 మందికి గాయాలు

గంగావతి రూరల్, అక్టోబరు 13: శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనం చేసుకుని గ్రామానికి తిరిగి వెళుతున్న సమయంలో ట్రాక్టర్ ఇంజన్ ట్రాలీ వేరుకావడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ట్రాలీలో ప్రయాణిస్తున్న 33 మంది తీవ్రంగా గాయపడిన ఘటన దేవిక్యాంపు దేవికొండపై చోటు చేసుకుంది. శనివారం రాయచూరు జి ల్లా సింధనూరు తాలూకా జంభునాథ హళ్ళి, హనుమాపుర గ్రామానికి చెందిన మహిళలు, పిల్లలతో పాటు 33 మంది బీరేశ్వరదేవి దర్శానానికి వచ్చారు. దర్శనం ముగించుకుని కొం డపై నుంచి ట్రాక్టర్ దిగుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాలీ కింద చిక్కుకున్న మహిళలను స్థానిక ప్రజలు, అధికారులు రక్షించారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరందరికి ప్రాథమిక చికిత్స అందించి గంగావతిలోని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారందరిని పట్టణంలోని సముదాయ ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. చిన్నపాటి గాయాలతో ప్రాణాలతో బయటపడిన వారు ఇళ్లకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



బోల్తాపడిన ట్రాక్టర్ ట్రాలీ

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

రాయచూరు, అక్టోబరు 13: నగర సమీపంలో ఆదివారం జరిగిన రెండు వేర్వురు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు,మరో యువతి మృతిచెందారు. సాక్షి, సృజన ఇద్దరు అక్క చెల్లెళ్లు స్కూటీ పై వస్తుండగా నగర సమీపంలోని వ్యవసాయ వీవీ వద్ద ఉన్న బసవ ఆస్పత్రి వద్ద కారు బైకును ఢీ కొట్టింది. రోడ్డు క్రాస్ చేస్తున్న సందర్భంగా జరిగిన ఈ ప్రమాదంలో బైక్‌పై వెనక్కు కూర్చున్న సాక్షి(22) అక్కడికక్కడే మృతి చెందగా బైక్ నడుపుతున్న సృజన గాయపడింది. ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. హైదరాబాద్-రాయచూరు ప్రధాన రహదారి వైటీపీఎస్ వద్ద జరిగిన మరో ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులకు లారీ ఢీ కొట్టడంతో మృతిచెందారు. చిక్కసుగూరు నుంచి రాయచూరుకు వస్తున్న ఇద్దరు యువకులను వెనకనుంచి లారీ ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో ఒకరు ఏపీకి చెందిన జనార్థన్ మడివాళ(35) కాగా మరొకరు లింగసుగూరుకు చెందిన చన్నబసవ పాటీల్(26)గా గుర్తించారు. రాయచూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయమ్...

దత్తోపంత్ ఠేంగడి (వర్ధంతి)



హిందూత్వవాదిగా పేరొందిన దత్తోపంత్ బాపూరావ్ ఠేంగడి 1920 నవంబరు 10న మహారాష్ట్ర రాష్ట్రం వార్ధా జిల్లా ఆర్వి గ్రామంలో జన్మించారు. భారతీయ కార్మిక సంఘ నాయకుడు, స్వదేశీ జాగరణ్ మంచ్, భారతీయ మజ్దూర్‌సంఘ్, అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ), భారతీయ కిసాన్ సంఘ్‌ల వ్యవస్థాపకులు. మరణించేంతవరకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పూర్తి సమయ ప్రచారక్‌గా పనిచేశారు. దేశ సామాజిక, ఆర్థిక జీవన స్థితులపై తనదైన ముద్రవేసి భావితరాలకు మార్గదర్శకం చేశారు. 'పద్మభూషణ్' అవార్డు ప్రకటించినా సున్నితంగా తిరస్కరించారు. నిరాడంబర జీవనం, ప్రతి అంశంపైనా సరైన అవగాహన, లోతైన, స్పష్టమైన ఆలోచనలు, ధృడ విశ్వాసం, అకుంఠిత దీక్ష ఆయన సుగుణాలు. 2004 అక్టోబరు 14న కన్నుమూశారు.

రోజర్ మూర్ (జయంతి)



జేమ్స్‌బాండ్ పాత్రతో అంత ర్జాతీయగా పేరొందిన ప్రముఖ ఆంగ్ల నటుడు సర్ రోజర్ జార్జ్ మూర్ 1927 అక్టోబరు 14న లండన్‌లో జన్మించారు. 1973-85ల మధ్య 'జేమ్స్‌బాండ్' పాత్రలు ఆయనకు ఎంతో గుర్తింపు తెచ్చాయి. బ్రిటీష్, అమెరికన్ టెలివిజన్ సిరీస్‌లో నటించారు. 1991లో యునిసెఫ్ రాయబారిగా వ్యవహరించారు. 2007లో 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్' అవార్డు, జీవితసాఫల్య పురస్కారం ఇతర అవార్డులు అందుకున్నారు. 2017 మే 23న కన్నుమూశారు.

నిఖిల్ బెనర్జీ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత పండిట్ నిఖిల్ రంజన్ బెనర్జీ 1931 అక్టోబరు 14న కోల్కత్తాలో జన్మించారు. మైహర్ ఘరానాలో క్లాజికల్ సితారిస్ట్‌గా పేరొందారు. అల్లావుద్దీన్ ఖాన్ వద్ద సంగీతం నేర్చుకుని 9వ యేటనే ఆలిండియా రేడియోలో ప్రదర్శనలు ఇచ్చారు. రవిశంకర్, విలాయత్‌ఖాన్‌ల తర్వాత అంతటి పేరొందిన సితారిస్ట్, ప్రత్యేకించి మెలోడీ, రిథమిక్ సంగీతంలో తనదైన ముద్రను చాటుకున్నారు. సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్నారు. పలు దేశాలలో పర్యటించి కచేరీలు ప్రదర్శించారు. 1986 జనవరి 27న కన్నుమూశారు.

వేదగిరి రాంబాబు (జయంతి)



ప్రముఖ తెలుగు రచయిత వేదగిరి రాంబాబు 1952 అక్టోబరు 14న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. ఆయన కథానికలకు రేడియోద్వారా మంచి ప్రాచుర్యం లభించింది. సీరియల్ రైటర్‌గా, పబ్లిషర్‌గా రాణించారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పలు దిన పత్రికలకు వ్యాసాలు రాశారు. 'పాపం పసివాడు' దూరదర్శన్‌లో 52వారాలపాటు ప్రసారమైన సీరియల్‌కు 'బంగారు నంది అవార్డు' దక్కింది. వంద కథానికలతో 'తెలుగు కథానిక డాట్‌కామ్'ను ఆరంభించారు. ఆకాశవాణిలో జింగిల్స్‌కు ప్రసార భారతి పురస్కారం, గురజాడ స్మారక పురస్కారం అందుకున్నారు. 2018 ఆగస్టు 18న కన్నుమూశారు.

శివశంకరి (పుట్టినరోజు)



ప్రముఖ తమిళ రచయిత్రి శివశంకరి 1942 అక్టోబరు 14న చెన్నైలో జన్మించారు. ఆమె నవలలు సినిమాలుగా, సీరియల్స్‌గా రూపుదిద్దుకున్నాయి. 30 నవలలు, 15 ట్రావెలాగ్స్, 150కుపైగా చిన్నకథలు రాశారు. అందులో అత్యధికంగా ఆంగ్లంలోకి, ఇతర భాషలలో అనువాదమయ్యాయి. ఇందిరాగాంధీ బయోగ్రఫీ రాశారు. కస్తూరి శ్రీనివాసన్ అవార్డు, రాజా సర్ అణ్ణామలై చెట్టియార్ అవార్డు, భారతీయ భాషా పరిషత్ అవార్డు, తమిళ్ అన్నై అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. 2024లో డాక్టర్ సి నారాయణరెడ్డి జాతీ సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు.

శశాంక్ (పుట్టినరోజు)



శశాంక్ సుబ్రమణ్య 1978 అక్టోబరు 14న కర్ణాటక రాష్ట్ర హాసన్ జిల్లా రుద్రపట్నలో జన్మించారు. వేణువాదనలో సొంతంగా రాణించారు. కర్ణాటక, హిందూస్తానీ సంగీతంలో రాణించారు. గ్రామీ అవార్డుకు ఎంపికయ్యారు. 6వ ఏట నుంచే సంగీతంలో సత్తా చాటుకున్నారు. ఆలిండియా రేడియో, బుల్లితెర చానెల్స్‌లో నేరుగా 'ఏ' గ్రేడ్ కళాకారుడిగా వచ్చారు. 50కుపైగా దేశాలలో సంగీత కచేరీలు ప్రదర్శించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, కళై మామణి, 2000లో శృంగేరీ ఆస్థాన విద్వాన్‌గా, ఇతర గౌరవాలు అందుకున్నారు. ఈయన జీవితంపై 2006లో డెస్టినేషన్ మ్యూజిక్ పేరిట బీబీసీ ప్రసారం చేసింది. 2022లో ఫ్రెంచ్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక పురస్కారం పొందారు.

తండ్రిని చంపిన తనయుడు

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తండ్రీ కొడుకుల మధ్య కుటుంబ విషయంలో వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఏకంగా తండ్రినే చాకుతో పొడిచి కుమారుడు హతమార్చాడు. బెంగళూరు శివారులోని బన్నేరుఘట్టరోడ్డు జనతా కాలనీలో సంఘటన చోటు చేసుకుంది. కేరళకు చెందిన వేలాయుధన్ కుటుంబం బెంగళూరులో నివసిస్తోంది. ఆదివారం తండ్రీకొడుకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో తండ్రి వేలా యుధన్ (76)పై కుమారుడు వినోద్‌కుమార్ చాకుతో పొడవడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందారు. మృతదేహాన్ని ఆనేకల్ ఆసుపత్రికి తరలించారు. వినోద్ కుమార్‌ను బన్నేరుఘట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అబ్బాయిని కత్తితో పొడిచిన బాబాయ్

అనంతపురం క్రైం,అక్టోబరు 13: ద్విచక్రవాహనం కోసం ఓ వ్యక్తి తన అన్నకుమారుడిని కత్తితో పొడిచాడు. నగరంలోని నీరుగంటి వీధికి చెందిన బాబామహమ్మద్, అతడి బాబాయి బాబా ఫక్రుద్దీన్ మధ్య శనివారం స్కూటర్ విషయంలో గొడవ జరిగింది. తానే రిపేర్ చేయించి ఉంచుకుంటానని బాబా ఫక్రుద్దీన్ ఆ స్కూటర్‌ను గుత్తిరోడ్డులోని ఓ మెకానిక్ సెంటర్‌లో ఇచ్చాడు. మరుసటి రోజు ఆ షెడ్‌కు వెళ్లగా ఆ వాహనం కనిపించకపోవడంతో బాబాయ్ వద్దకెళ్లాడు. దానిని అతను తీసుకెళ్లడంతో గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఆవేశంతో ఫక్రుద్దీన్ మహమ్మద్‌ను కత్తితో పొడిచాడు. మహమ్మద్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా చాముండేశ్వరి ఊరేగింపు



వైట్‌ఫీల్డ్‌లో గ్రామదేవతల ఊరేగింపు

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా నాడదేవత చాముండేశ్వరి దేవిని నగర వ్యాప్తంగా పలు చోట్ల ఆదివారం ఘనంగా ఊరేగించారు. జేసీ నగర్‌లో పెద్దసంఖ్యలో పూల పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. మరోవైపుపలు చోట్ల నుంచి సాగిన ఊరేగింపు అనంతరం హలసూరు చెరువులో అమ్మవారిని నిమజ్జనం చేశారు. లాల్‌బాగ్ సిద్దాపురలో విజయదశమిని పురస్కరించుకుని స్థానిక శ్రీరామసముదాయ భవనంలో కన్యకా పరమేశ్వరిదేవి ఉత్సవమూర్తికి విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, అలంకరణలు చేశారు. వాసవిహోమం నిర్వహించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తాదులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు.

మహదేవపురలో...

మహదేవపుర: విజయదశమిని పురస్కరించుకుని కాడుగూడి, వైట్‌ఫీల్డ్ చుట్టుపక్కల ప్రాంతాలనుంచి 50కుపైగా గ్రామదేవతల పల్లకీలను వైట్‌ఫీల్డ్ సమీపంలోని అంబేడ్కర్‌గుట్ట మైదానంలో ఘనంగా నిర్వహించారు. చన్నసంద్ర, నాగొండనహళ్ళి, ఇమ్మడిహళ్ళి, నల్లూరహళ్ళి, రామగొండనహళ్ళి, పట్టందూరు అగ్రహార, దిన్నూరు, బెళత్తూరు చుట్టుపక్కల ప్రాంతాలనుంచి గ్రామదేవతలు ఆంజనేయస్వామి, బసవేశ్వరస్వామి, శనిమహాత్ముడు, మునేశ్వరుడు, మారమ్మ, సపలమ్మ, యల్లమ్మ, గంగమ్మ, దొడ్డమ్మ తదితర దేవతలను పల్లకీలలో మైదానానికి చేరుకున్నాయి. అన్ని గ్రామాల దేవతలను ఇక్కడ దర్శించే సౌభాగ్యం కలిగిందని గ్రామ పెద్ద మారప్ప తెలిపారు. డొళ్ళుకుణిత, కంసాలె, వీరగాసె తదితర కళా బృందాలు పాల్గొన్నాయి. ఉత్సవాల్లో మాజీ మంత్రి అరవింద లింబావళి, మాజీ ఎంపీ మునిస్వామి, నియోజక వర్గ బీజేపీ నగర అధ్యక్షుడు మనోహరరెడ్డి, గ్రామీణ అధ్యక్షుడు నటరాజ్, మారప్ప, మహేంద్రమోది, ఎల్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌టీ నగర్‌లో చాముండేశ్వరి ఊరేగింపు

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట: పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో పారంపర్యంగా నవరాత్రి వేడుకలు సాగాయి. విజయదశమి రోజున లోకకల్యాణార్థం జమ్మిచెట్టుకు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త రూపసి రమేశ్ నేతృత్వంలో పూజాకైంకర్యాలు కొనసాగాయి. వేదబ్రహ్మ యగవకోటె నారాయణ దాశరథి భట్టాచార్య, వేదపండితుడు కాకర్ల సుబ్రమణ్యశాస్త్రిలు వేదమంత్రాల మధ్య పూజా కార్యక్రమాలు సాగాయి. ఆలయ అభివృద్ధి మండలి అధ్యక్షుడు రఘు, కార్యదర్శి మధు లక్ష్మణాచార్, మునిరాజు, పురసభ మాజీ ఉపాధ్యక్షుడు మునియప్ప, తదితరులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జగ్జీవన్‌రామ్ నగర్‌లో..

విజయనగర: జగజ్జీవన్‌రామ్‌నగర్‌లో జ్ఞానాక్షి భువనేశ్వరి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో శరన్నవరాత్రులలో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. శనివారం దుర్గామాత అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవాలకు సహ కరించిన మంజునాథ్, ఇతర ఉభయదారులకు ఆలయ ఉత్సవమండలి సభ్యులు స్వాగతించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



సిద్దాపులో అలంకరణలో వాసవీమాత



విశేషపూజల్లో మాజీ మంత్రి అరవింద లింబావళి



జగ్జీవన్‌రామ్‌నగర్‌లో దుర్గామాత అలంకరణలో జ్ఞానాక్షిదేవి



ఆవతిలో కన్యకాపరమేశ్వరికి అలంకరణ

ఆలంబగిరిపై విజయదశమి ఉత్సవం





జమ్మిచెట్టుకు పూజల్లో ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం దంపతులు, చేళూరులో వాసవీమాతకు అలంకరణ



గజరాజుపై ఊరేగుతున్న చౌడేశ్వరీ దేవి

చింతామణి, అక్టోబరు 13: తాలూకాలోని పురాణ ప్రసిద్ధ ఆలంబగిరిపై కొలువైన లక్ష్మీవెంకటరమణస్వామి దేవాలయంలో విజయదశమి రోజున విశేషపూజా కైంకర్యాలు కొనసాగాయి. ఆలయం నుంచి సుమారు కిలో మీటరు దూరంలో ప్రత్యేకించి జమ్మిచెట్టు పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భూనీళా సమేత వెంకట రమణస్వామి ఉత్సవమూర్తులను జమ్మిచెట్టు సమీపాన ప్రత్యేక మంటపంలో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంకీర్తనా పాదయాత్రలో క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం దంపతులు పాల్గొన్నారు. జమ్మిచెట్టును పూలతో అలంకరించారు. చెట్టుపై విల్లుబాణాలు ఉంచి పూజలు చేశారు. శాస్త్రోక్తంగా అర్చకబృందం వేద ఘోష చేస్తుండగా డాక్టర్ ఎంఆర్ జయరాం దంపతులు పూజలు చేశారు. గ్రామంలోని ప్రజలంతా ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయానికి వేంచేపు చేసి అష్టావధాన సేవ నిర్వహించారు. భక్తుల సామూహిక సంకీర్తన అలరించింది. దసరాలో ప్రతిరోజూ ఆలంబగిరిపై విశేషపూజలు, భజనలు కొనసాగాయి. యోగి నారేయణ సంకీర్తనా ప్రాజెక్టు సంచాలకులు బాలకృష్ణ భాగవతార్ తదితరులు పాల్గొన్నారు.

చేళూరులో...

చేళూరు: తాలూకా కేంద్రమైన చేళూరులోని వాసవి ధర్మశాలలో కన్యకాపరమేశ్వరిదేవికి విజయ దశమి రోజున ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అమ్మవారు రాజరాజేశ్వరి మాత అలంకరణలో దర్శన మి చ్చారు. ఉత్సవాలలో చివరిరోజు ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా తాలూకాలోని సోమనాథపుర సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేషపూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అన్నదానం నిర్వహించారు.

ఆనేకల్‌లో దసరా వైభవం

దొమ్మసంద్ర: రాష్ట్రంలో ప్రముఖమైన మైసూరు తరహాలో బెంగళూరు శివారులోని ఆనేకల్‌లో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. దసరా ఉత్సవాల్లో ఆనేకల్‌లోని చౌడేశ్వరి అమ్మవారిని జంబూసవారిగా ఊరేగించారు. జాతీయ స్థాయిలో పేరొందిన జానపదకళాబృందాలు, గ్రామీణ ప్రాంతాలనుంచి విచ్చేసి విజయదశమి వేడుకలకు మరింత సొబగు తెచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి వీక్షించారు. డొళ్ళుకుణిత, జవళి కుణిత, పులివేషం, కత్తిసాము, గారడీబొమ్మలు, పట్టదకుణిత, వీరగాసె, తదితర కళాబృందాలు రథోత్సవంలో పాల్గొనడంతో దసరా వైభవం చాటి నట్లయ్యింది. గజరాజుపై కొలువుదీరిన చౌడేశ్వరి అమ్మవారి ఊరేగింపును తొగటవీర సముదాయ స్వామిజీ నిజ గుణానందస్వామిజీ ప్రారంభించారు. బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్, మాజీ ఎంపీ ఏ నారాయణస్వామి, ఎమ్మెల్యే బీ శివణ్ణ, పురసభ అధ్యక్షురాలు సుధా నిరంజన్ పాల్గొన్నారు. మైసూరు దసరాను వీక్షించలేనివారు ఇక్కడి జంబూ సవారిని తిలకించి సంబరపడ్డారు. తాలూకాలో భక్తులతో దసరా సందడి నెలకొంది.

జాతీయ యోగా పోటీలకు ఎంపిక



జాతీయ యోగాపోటీలకు ఎంపికైన బృందం వీరే

దొడ్డబళ్ళాపుర, అక్టోబరు 13: యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, హిమాచల్ యోగా అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 27వరకు హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం ఊన జిల్లాలోని ఇందిరాగాంధీ ఇండోర్‌స్టేడియంలో జరిగే 49వ సబ్ జూనియర్, అండ్ జూనియ్ జాతీయ యోగాసన క్రీడా చాంపియన్‌షిప్ 2024 పోటీలు జరగనున్నాయి. దొడ్డబళ్ళాపుర పట్టణంలోని నిసర్గ యోగా కేంద్రానికి చెందిన విద్యార్థులు పోటీలలో పాల్గొననున్నారు. బాలుర విభాగంలో జేసీ ప్రథమశెట్టి, యశ్విన్ ఎస్, కుశల్ ఎస్, నీరజ్ ఎల్, శశాంక్, కేఎన్ విశ్వనాథ్, బాలికల విభాగంలో ఎస్ అపూర్వ, ఎస్ ఖుషిప్రియ, గౌతమి హెచ్, ఆర్ యశస్విని, టి హితశ్రీ, మధుశాలిని, ఎంఆర్ జాహ్నవిలు జాతీయ యోగా పోటీలకు ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్ర బాలికల విభాగం కేప్టెన్‌గా ఎంఆర్ జాహ్నవి, బాలుర విభాగం నుంచి మేనేజర్‌గా ఎస్‌సి శివకుమార్ ఎంపికయ్యారు. బెంగళూరు గ్రామీణ జిల్లా అమెచ్యూర్ యోగా సంస్థ అధ్యక్షుడు ఎంజి అమరనాథ్, కార్యదర్శి ఏ నటరాజ్, కోశాధికారి కేఆర్ శ్యామసుందర్, హెచ్‌ఆర్ పుష్పక్ రవీంద్ర, యోగా పదాధికారులు, విద్యార్థినీ విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

వచన నవరాత్రులు ప్రతిచోటా జరగాలి



వచనజ్యోతి బళగ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు ఇలా...

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వచన నవరాత్రులు ప్రతిచోటా జరగాలని ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ అభిప్రాయపడ్డారు. వచనజ్యోతి బళగ ఆధ్వర్యంలో కల్యాణ లే అవుట్‌లో వచన విజయదశమి వేడుకలు శనివారం జరిగాయి. ముఖ్యులుగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరాత్రులను వచనజ్యోతి బళగ భిన్నంగా జరిపిందని అక్క నాగమ్మ, బొంతాదేవి, అక్కమ్మ, గొగ్గవ్వల సాధనలను స్మరించుకుంటూ 9రోజులు ప్రత్యేకమైన వచనాలు జరిగాయన్నారు. శతాబ్దాలక్రితమే బసవణ్ణ సమసమాజ నిర్మాణం ఆకాంక్షించారని ఆయన అడుగుజాడల్లోనే ఎంతోమంది సాధ్వీమణులు పరంపరను కొనసాగించారన్నారు. మరళవాడి శివమఠం మృత్యుంజయస్వామిజీ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. భక్తులకు స్వామిజీ సందేశమిస్తూ రాష్ట్రపతిగా బి.డి.జత్తి ఓసారి అంబేద్కర్‌ను కలసి బసవతత్వాల పుస్తకాన్ని అందించారన్నారు. కొన్నిరోజుల తర్వాత బసవతత్వాలు సమసమాజమనే సందేశమిచ్చాయని, బౌద్ధమతంలోకి చేరకుంటే బసవణ్ణ ఆశయాలతో ముందుకెళ్లేవాడినని అభిప్రాయపడ్డారన్నారు. అంతటి బసవతత్వాలు అందరూ పాటించాలని, ప్రత్యేకించి యువత అభ్యసించి తెలుసుకోవాల్సి ఉందన్నారు. వచనజ్యోతి బళగ అధ్యక్షుడు పినాకపాణి, గౌరవాధ్యక్షుడు మహేశ్‌బెల్లద, సంచాలకులు ప్రసన్న, మధు, రాజా గురుప్రసాద్, ప్రభు ఇసోనహళ్లి, మధు శివకుమార్, నాగరాజ్‌స్వామి, కాంతరాజ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం బసవణ్ణ ఉత్సవ విగ్రహానికి పుష్పార్చన చేసి ఊరేగించారు.

ఈవెంట్ మేనేజ్‌మెంట్ ముసుగులో వేశ్యావాటిక

» దంపతుల అరెస్టు



దంపతులు వీరే ..

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈవెంట్ మేనేజిమెంట్ ముసుగులో హైటెక్ వేశ్యావాటిక దందా సాగిస్తున్న దంపతులను సీసీబీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నగరంలోని పట్టెగారపాళ్యలో ప్రకాశ్, పారిజాత దంపతులు అరెస్టు అయినవారు. వీరు రాకేశ్, పూజల పేర్లతో దందా సాగించేవారు. ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఉత్తర కర్ణాటక ప్రాంతంనుంచి పేద యువతులను బెంగళూరుకు రప్పించుకుని వివిధ ప్రాంతాలకు పంపేవారు. శ్రీమంతులు, బడావేత్తలు, యువత చెంతకు వీరిని పంపేవారని గుర్తించారు. పెళ్లి ఈవెంట్ మేనేజిమెంట్ పేరిట వారానికోసారి ఉత్తర కర్ణాటక ప్రాంతం నుంచి యువతులను తమిళనాడు, పాండిచ్చేరిలకు విలాసవంతమైన రిసార్టులకు తీసుకెళ్లేవారు. అక్కడికి ముందుగానే పలువురు ప్రముఖులను రప్పించుకుని వారి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసేవారని గుర్తించారు. బెంగళూరు నుంచి తమిళనాడుకు యువతులను తీసుకెళ్తుండగా దాడి చేసిన పోలీసులు నలుగురిని రక్షించారు. సమగ్రంగా దర్యాప్తు జరపడంతో దందా వెలుగులోకి వచ్చింది.

రాజరాజేశ్వరిగా సాయిసంతోషిమాత



షిర్డీసాయిబాబాకు విశేష పూజలు



రాజరాజేశ్వరీదేవిగా సాయిసంతోషిమాత

బొమ్మనహళ్ళి, అక్టోబరు 13: అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లో వెలసిన శాంతిధామలోని సాయిసంతోషిమాతా ఆలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. శరన్నవరాత్రులలో ప్రతిరోజూ ఒక్కో అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ప్రతిరోజూ ఆలయంలో విశేషపూజలు కొనసాగాయి. శనివారం రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు. కుంకుమార్చన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు. షిర్డీ సాయిబాబా ఆలయంలోనూ ప్రత్యేక పూజలు కొనసాగాయి. మూల విరాట్టుకు భక్తులు స్వయంగా క్షీరాభిషేకం అవకాశం కల్పించారు. తీర్థప్రసాదాల పంపిణీతోపాటు అన్నదానం చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడా రామకృష్ణ వెల్లడించారు. కాగా షిర్డీసాయిబాబా సమాధి 106 సంవత్సరాలు అయిన సందర్భంగా విశేషపూజలు, అలంకరణ జరిగాయి. ఆలయ ట్రస్టు ఉపాధ్యక్షుడు ప్రకాశ్‌నర్వాణి కుటుంబీకులు సాయి సంతోషిమాతా ఆయంలో తొమ్మిదిరోజుల ఉత్సవాలను పర్యవేక్షించారు. ట్రస్టు సభ్యులు తాతయ్యగుప్త, కృష్ణయ్యశెట్టి, వెంకటేశ్‌గుప్త, వలంటీర్‌లు తదితరులు పాల్గొన్నారు.